డిప్యూటీ డైరెక్టర్‌గా నాగార్జునకు ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - భీమవరం

సమాచార శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దాసరి నాగార్జునకు డిప్యూటీ డైరెక్టర్‌గా ఉద్యోగోన్నతి లభించింది. జిల్లా సమాచార శాఖ కార్యాలయంలో ఎడిగా పని చేస్తున్న నాగార్జునకు డిప్యూటీ డైరెక్టర్‌గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఆ శాఖ ఎక్స్‌అఫిషియో సెక్రటరీ టి.విజయకుమార్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన కాకినాడ డిప్యూటీ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. నాగార్జున ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సమాచార శాఖ కార్యాలయంలో 2019 జులై నుండి సహాయ సంచాలకులుగా పని చేస్తున్నారు. నాగార్జున ఉద్యోగోన్నతిపై వెళ్తున్న సందర్భంగా మీడియా ప్రతినిధులు, కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ప్రమాదంలో 'తీరం'..!

'ఇన్‌కోయిస్' అధ్యయనంలో వెల్లడి

జిల్లాలోనూ అత్యధికంగా సముద్రతీరం కోతకు గురికానున్నట్లు నిర్ధారణ

10 శాతం బహుళ ప్రమాదాలు కలిగిన జోన్‌గా గుర్తింపు

ఆందోళనలో తీర ప్రాంత గ్రామాల ప్రజలు

కెపిపాలెంలో కోతకు గురవుతున్న సముద్ర తీరం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లాలోని సముద్ర తీర ప్రాంతానికి ప్రమాదం పొంచి ఉందని, తీర ప్రాంతంలో నివశిస్తున్న ప్రజానీకం ముంపు సమస్యను ఎదుర్కోనున్నట్లు నేషనల్ ఇంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ (ఇన్‌కోయిస్) అధ్యయనంలో వెల్లడైంది. ఇన్‌కోయిస్ డైరెక్టర్ టి.శ్రీనివాస్‌కుమార్ నేతృత్వంలోని సీనియర్ శాస్త్రవేత్తలు టిఎం.బాలకృష్ణన్‌నాయర్, సుధీర్‌జోసెఫ్, పి.ఎ.ఫ్రాన్సిస్, పిసి మొహంతి, ఆర్ఎస్ మహేంద్ర ఈ అధ్యయనం నిర్వహించారు. శాస్త్రవేత్తల అధ్యయనంలో అనేక దిగ్భ్రాంతి గొలిపే విషయాలు వెల్లడయ్యాయి. సముద్ర తీరం పెద్దఎత్తున కోతకు గురికానున్న ప్రాంతాల్లో జిల్లాలోని తీర ప్రాంతం సైతం ఉంది. జిల్లాలోని తీర ప్రాంతం పది శాతం బహుళ ప్రమాదాలు కలిగిన తీర ప్రాంతజోన్ (సిఎంజెడ్)గా శాస్త్రవేత్తలు గుర్తించారు. దీంతో ముంపునకు గురయ్యే తీర ప్రాంతం జిల్లాలోనూ అత్యధికంగా ఉన్నట్లు తేలింది. రాష్ట్రంలో 706 గ్రామాలు, ఎనిమిది పట్టణాల్లో దాదాపు 90 శాతం ప్రాంతం బహుళ ప్రమాదకర జోన్ పరిధిలోకి వస్తాయని వెల్లడించిన అధ్యయనంలో పశ్చిమగోదావరి జిల్లాలోని తీర ప్రాంతం గురించి శాస్త్రవేత్తలు స్పష్టంగా పేర్కొన్నారు. విభజిత పశ్చిమగోదావరి జిల్లాలో 19 కిలోమీటర్ల మేర సముద్ర తీర ప్రాంతం విస్తరించి ఉంది. మొగల్తూరు, నరసాపురం మండలాల్లోని పేరుపాలెం సౌత్, కెపిపాలెం సౌత్, తూర్పుతాళ్లు, పెదమైనివాని లంక, చినమైనివాని లంక, బియ్యపుతిప్ప గ్రామాలు తీరప్రాంతాన్ని ఆనుకుని ఉన్నాయి. దాదాపు 20 వేల మంది జనాభా వరకూ తీరప్రాంత పరిధిలో నివశిస్తున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. వీరిలో పది వేల మందికిపైగా మత్స్యకారులు ఉన్నారు. ప్రభుత్వ అధికారిక లెక్కల ప్రకారం నాలుగువేల మందికి పైగా సముద్రంలో చేపల వేటతో ఉపాధి పొందుతున్నారు. గతంకంటే తీరప్రాంతంలో కోత పెరుగుతున్న పరిస్థితి ఉందని స్థానికులు చెబుతున్నారు. పలు గ్రామాల్లో తీరం పెద్దఎత్తున కోతకు గురవడంతో కొబ్బరిచెట్లు సైతం నేలకొరిగిన పరిస్థితి ఉంది.

ఆందోళనలో తీర ప్రాంత ప్రజలు

తీర ప్రాంతంలో ముంపు ముప్పుపై వెల్లడవుతున్న అధ్యయనాలతో స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే తుపాన్లు సంభవించినప్పుడు తీర ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలల ఉధృతి భయాందోళనలు కల్గిస్తున్నాయి. తీరంలో అలలు ముందుకొస్తుండటంతో కోత పెరుగుతోంది. దీంతో తుపాన్ల సమయంలో స్థానిక ప్రజానీకాన్ని పునరావాస కేంద్రాలకు తరలించాల్సిన పరిస్థితి ఉంది. 50 ఏళ్ల ముందు కంటే తీర ప్రాంతం కోతకు గురై బాగా ముందుకు చొచ్చుకొచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. తీరం కోత పెరిగే కొద్దీ స్థానిక ప్రజానీకానికి సంబంధించిన భూములు, ఇళ్లు సైతం ప్రమాదంలో పడే పరిస్థితి రానుంది. అదే జరిగితే తీర ప్రాంత ప్రజలు ఆర్థికంగా తీవ్రంగా దెబ్బతినే పరిస్థితి ఏర్పడనుంది. పంట భూములను కోల్పోనున్నారు. గత శతాబ్దకాలంలో అలల తాకిడి స్థాయిలను పరిగణనలోకి తీసుకుని ప్రస్తుత అధ్యయనం జరిగింది. దీనిప్రకారం తీరం ప్రమాదంలో ఉందని స్పష్టమవుతోంది.

నదులపై అధిక రిజర్వాయర్ల నిర్మాణంతోనే తీరం కోత

డాక్టర్ పి.ఎ.రామకృష్ణంరాజు, ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రొఫెసర్, పర్యావరణ వేత్త

కృష్ణ, కావేరితోపాటు పలు నదులపై పెద్దసంఖ్యలో రిజర్వాయర్లు నిర్మించేశారు. నదుల్లో నీరు సముద్రంలోకి రావడం లేదు. నదుల్లో నీరు సముద్రంలోకి ప్రవేశించినప్పుడు పెద్దఎత్తున మట్టి చేరుకుంటుంది. దీంతో సముద్రం తీరంలో మట్టి చేరి లోపలికి పూడుకుంటుంది. పదివేల ఏళ్ల క్రితం నుంచి కొట్టుకొచ్చిన మట్టి వల్లే ఇప్పుడున్న తీరం ఉంది. సముద్రంలోకి నదుల నీరు రాకపోవడంతో మట్టిరావడం తగ్గిపోయింది. దీంతో సముద్రపు తీరం కోతకు గురికావడం పెరిగిపోతుంది. కొల్లేరు పూడుకుపోవడం కారణంగా ఉప్పుటేరు కోతకు గురవుతోంది. పర్యావరణ సమతుల్యత దెబ్బతినడంతో భవిష్యత్తులో ప్రమాదంగా మారనుంది.



సభలో మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

160 స్థానాల్లో టిడిపిదే గెలుపు

నాలుగేళ్లలో ఎనిమిది లక్షల కోట్ల అప్పు చేసిన ముఖ్యమంత్రి జగన్

మినీ మహానాడులో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చన్నాయుడు

ప్రజాశక్తి - కాళ్ల

వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ 160 స్థానాల్లో విజయకేతనం ఎగురవేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని పెదఅమిరంలో తెలుగుదేశం పార్టీ జిల్లాస్థాయి మినీ మహానాడు సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో సైకో పాలన సాగుతుందని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడిన వ్యక్తులపై, సంస్థలపై దాడులు చేయడం, జైల్లో పెట్టడం వంటి పనులు పనులతో పాలన సాగిస్తున్నారన్నారు. వైసిపికి అధికారం ఇచ్చి ప్రజలు అతిపెద్ద తప్పు చేశారన్నారు. కోడి కత్తి కేసు, బాబాయ్ హత్యలను సానుభూతిగా చూపి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి జగన్ కక్షసాధింపు ధోరణిలో పాలన సాగిస్తున్నారని విమర్శించారు. రాజధాని అమరావతిని జగన్ చిధ్రం చేశారన్నారు. విద్యుత్, ఆర్‌టిసి, ఇంటి పన్ను, చెత్తపన్ను రూపంలో ప్రజల నుంచి రూ.మూడు లక్షల కోట్లను వసూలు చేసిందని ఆరోపించారు. టిడిపి అధికారంలో ఉన్నప్పుడు కార్యకర్తలకు కొంత అన్యాయం జరిగిందని, వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రాగానే వారికి రాజ్యాంగబద్ధమైన పదవులు ఇస్తామని చెప్పారు. ఒకప్పుడు అన్నింట్లో ప్రథమ స్థానంలో ఉండే రాష్ట్రం ఇప్పుడు అట్టడుగున ఉందన్నారు. ఈ ముఖ్యమంత్రి కోసం తాను చెప్పనక్కర్లేదని, ప్రస్తుత మంత్రులు ధర్మాన, బొత్స వైసిపిలోకి రాక ముందే జగన్ ఏమిటో చెప్పారన్నారు. ఎన్నికల్లో ప్రలోభాలకు లొంగితే మళ్లీ అరాచక పాలనే వస్తుందని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో కార్యకర్తలు కష్టపడి పనిచేస్తేనే తెలుగువారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన వారమవుతామని అన్నారు. ఎంపీ అవినాష్‌రెడ్డి అరెస్టు విషయంలో సిబిఐ అధికారులు కూడా భయపడే పరిస్థితి ఎందుకని, కర్నూలు ఆసుపత్రిలో ఇతర రోగుల పరిస్థితి ఏమిటని నిలదీశారు. ఎపిలో అంబేద్కర్ రాజ్యాంగం అమలు కావడం లేదని కర్నూలులో పరిస్థితి చూస్తే అర్థమవుతుందన్నారు. ఉభయగోదావరి జిల్లాల్లో 34 స్థానాలు గెలుస్తామని టిడిపి జోన్-2 ఇన్‌ఛార్జి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. జనసేన పార్టీతో పొత్తుతో అన్ని స్థానాలూ గెలిచి తీరుతామన్నారు. ఎన్‌టిఆర్ పార్టీ పెట్టిన రోజు రాష్ట్రంలో ఉన్న పరిస్థితులే ఇప్పుడూ ఉన్నాయన్నారు. జగన్ పాలనలో రాష్ట్రం ఆర్థికంగా చిన్నాభిన్నమైందని విమర్శించారు. టిడిపిని కాపాడుకోవాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. గ్రామాల్లో మౌలిక సమస్యలు పరిష్కరించలేని వైసిపి ప్రభుత్వం పేదలపై బాదుడు కార్యక్రమాన్ని తలపెట్టిందని విమర్శించారు. బిజెపి ద్వంద్వ వైఖరి మార్చుకోవాలని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. రాష్ట్రంలో బిజెపి నాయకులు జగన్ ప్రభుత్వంపై ఒకవైపు ఛార్జిషీట్లు నమోదు చేస్తూ.. మరోవైపు అవినాష్‌రెడ్డి అరెస్టు విషయంలో ఉదాశీనంగా వ్యవహరిస్తూ ద్వంద్వవైఖరి అవలంబిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో అసలు పోలీసు వ్యవస్థ ఉందా అని ప్రశ్నించారు. మీడియాపై అవినాష్ గూండాలు నిత్యం దాడులు చేస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నారని మండిపడ్డారు. అన్ని రకాలుగా రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో బాయ్‌బాయ్ చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి, శాసనమండలి మాజీ ఛైర్మన్ ఎం.ఎ.షరీఫ్, ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు, పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, మాజీ మంత్రి పీతల సుజాత, మాజీ ఎంఎల్ఎలు వివి.శివరామరాజు, ఆరిమిల్లి రాధాకృష్ణ, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్‌రావు, నేతలు పొత్తూరి రామరాజు, వలవల బాబ్జి, ముత్యాల రత్నం, ముళ్లపూడి బాపిరాజు, కోళ్ల నాగేశ్వరరావు, పాతూరి రామచౌదరి, వీరవల్లి చంద్రశేఖర్, పాలి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు

పర్స సత్యనారాయణ జీవితం అజరామరం

పర్స సత్యనారాయణ జీవితం ఆదర్శనీయం - వ్యవసాయ కార్మిక సంఘం పూర్వపు రాష్ట్ర కార్యదర్శి మంతెన సీతారాం

ప్రజాశక్తి - భీమవరం

నిరాడంబరతకు, త్యాగానికి ప్రతిరూపమైన పర్స సత్యనారాయణ జీవితం అజరామరమని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం పూర్వపు రాష్ట్ర కార్యదర్శి మంతెన సీతారాం అన్నారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో సత్యనారాయణ వర్ధంతి సందర్భంగా 'పాలకుల విధానాలు-కార్మిక వర్గ కర్తవ్యం' అనే అంశంపై సభ నిర్వహించారు. ఈ సభకు సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ముఖ్యఅతిథి సీతారాం మాట్లాడుతూ చదువుకునే వయస్సు నుంచి అనేక కష్టాలు, ఒడిదుడుకులను ఎదుర్కొని సింగరేణి ఉద్యోగిగా జీవితాన్ని ప్రారంభించిన పర్స సత్యనారాయణ ప్రజాఉద్యమాల కోసం ఉద్యోగాన్ని వదిలిపెట్టి కార్మికవర్గ ఐక్యత కోసం పనిచేశారన్నారు. ఎంఎల్ఎ అయిన తర్వాత కూడా తనకొచ్చిన అన్ని రకాల సౌకర్యాలను పార్టీకి ఇచ్చి ప్రజల అభివృద్ధి కోసం అంకితమయ్యారన్నారు. వృద్ధాప్యంలోనూ ప్రజా ఉద్యమాల కోసం పరితపించారని తెలిపారు. ప్రస్తుత కార్మిక సంఘాలు పర్స లాంటి అనేకమంది త్యాగాల ఫలితంగా ఆవిర్భవించాయన్నారు. ప్రజల కోసం పని చేస్తున్నామని చెబుతున్న పార్టీలు, సంఘాలు నాయకులు, కార్యకర్తలు త్యాగజీవుల ఆశయాలను, ఆదర్శాలను అనుసరించాలని సూచించారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఉద్యోగులు, కార్మికులు, రైతులు, ప్రజలందరి సమస్యలను గాలికొదిలేసి కార్పొరేట్ వ్యక్తులకు ఊడిగం చేస్తున్న తరుణంలో ఆ విధానాలను ప్రతిఘటించాల్సిన ప్రతిపక్ష పార్టీలు కూడా పాలకవర్గాల విధానాలతో ఏకీభవించి ప్రజలకు అన్యాయం చేస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.బలరాం, పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జేమ్స్, యుటిఎఫ్ జిల్లా కోశాధికారి పట్టాభిరామయ్య మాట్లాడారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు, శ్రామిక మహిళా జిల్లా నాయకురాలు డి.కళ్యాణి, పట్టణ పేదల సంఘం నాయకులు ఎం.వైకుంఠరావు, ప్రజానాట్యమండలి నాయకులు చైతన్యప్రసాద్, సిఐటియు నాయకులు ఎం.ఆంజనేయులు, ఇంజేటి శ్రీనివాస్, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ నాయకులు డి.పెద్దిరాజు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో రాయ్, నేతలు

తాడేపల్లిగూడెం: కార్మికోద్యమ నిర్మాత పర్స సత్యనారాయణ ఉమ్మడి రాష్ట్రంలో అనేక కార్మిక ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించారని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ తెలిపారు. పర్స సత్యనారాయణ వర్ధంతి సభ సోమవారం స్థానిక సుందరయ్య భవనంలో గొన్నాబత్తుల నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కె.రాజారామ్మోహన్‌రాయ్ మాట్లాడుతూ పర్స సింగరేణి కార్మికోద్యమ నేతగా పని చేశారని తెలిపారు. విశాఖ ఉక్కు ఉద్యమం సందర్భంగా ఎంఎల్ఎ పదవికి రాజీనామా చేశారన్నారు. కార్మికోద్యమాల సందర్భంగా పలుమార్లు జైలుకెళ్లారని తెలిపారు. ప్రస్తుతం దేశంలోని పాలకులు కార్మిక చట్టాలు, హక్కులపై దాడి చేస్తున్నారని, వాటికి వ్యతిరేకంగా కార్మిక వర్గం ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, నేతలు ధనాల వెంకట్రావు, పి.వేణుగోపాల చౌదరి తదితరులు మాట్లాడారు.



భీమవరంలో నివాళులర్పిస్తున్న మంతెన సీతారాం, బలరాం, నేతలు

పెంటపాడు: పర్స సత్యనారాయణ వర్ధంతి సభ తాడేపల్లిగూడెం రైల్వే గూడ్స్‌షెడ్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో సత్తి కోదండరామరెడ్డి అధ్యక్షతన జరిగింది. తొలుత పర్స సత్యనారాయణ చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాబూరావు, చిర్ల పుల్లారెడ్డి మాట్లాడుతూ పర్స సత్యనారాయణ నమ్మిన సిద్ధాంతం కోసం తుదిశ్వాస విడిచే వరకు అహర్నిశలు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఎస్‌విఎస్.రెడ్డి, కర్రి సాయిరెడ్డి, అడపా ఆంజనేయులు, కర్రి సుబ్బిరెడ్డి, ఆకుల నారాయణ, మద్దాలు పుత్రయ్య, బుద్దాల నాని, గాది వెంకట్రావు, గుడిమెట్ల నాగబాబు పాల్గొన్నారు.

సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యాన పర్స వర్ధంతి సభ స్థానిక ఉల్లిపాయల మార్కెట్ వర్కర్స్ యూనియన్ కార్యాలయం వద్ద చల్ల చంద్రరావు అధ్యక్షతన జరిగింది. తొలుత పర్స చిత్రపటానికి ఉల్లిపాయల మార్కెట్ యూనియన్ అధ్యక్షులు చల్లా చంద్రరావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, నేతలు చిర్ల పుల్లారెడ్డి, బంకురు నాగేశ్వరరావు మాట్లాడగా కరక వెంకట్రావు, గొర్రెల శ్రీను, సిరపు గణేష్, దొర్లు సీతయ్య, వర్రి జోగి, గంటా కోటి, కేదిరెడ్డి అప్పన్న, బంకురు చిన్న పాల్గొన్నారు.

ఆచంట: కార్మిక హక్కుల కోసం రాజీ లేని పోరాటం చేయడమే పర్స సత్యనారాయణకు నిజమైన నివాళి అని సిఐటియు మండల కార్యదర్శి వద్దిపర్తి అంజిబాబు అన్నారు. కార్మికోద్యమ నేత పర్స సత్యనారాయణ వర్ధంతి సందర్భంగా వల్లూరు గ్రామంలో నిర్వహించిన సభలో తొలుత పర్స చిత్రపటానికి ఎపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఇందుకూరి సూర్యనారాయణరాజు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడగా తోటపల్లి సత్యనారాయణ, ఎస్‌విఎన్.శర్మ, పి.మోహన్‌రావు, సిర్రా నర్సింహమూర్తి, బొర్రా ధర్మారావు, తాళం సుబ్బారావు, ఇందుకూరి లెనిన్ పాల్గొన్నారు.

తణుకు రూరల్: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు పర్స సత్యనారాయణ ఉమ్మడి రాష్ట్రంలో కార్మిక వర్గాన్ని సంఘటితపర్చడంలో కీలకపాత్ర పోషించారని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ అన్నారు. పర్స వర్ధంతిని సోమవారం స్థానిక అమరవీరుల భవనం వద్ద ఘనంగా నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అడ్డగర్ల అజయకుమారి, పి.దక్షిణామూర్తి, గార రంగారావు, కడలి వీర్రాజు, యర్ర రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

పాలకొల్లు: కార్మికోద్యమ నిర్మాత పర్స సత్యనారాయణ ఆశయ సాధనకు కృషి చేయడమే ఘనమైన నివాళులని సిఐటియు మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్ అన్నారు. పర్స వర్ధంతి సందర్భంగా సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పురుషోత్తం, వి.సత్యనారాయణ, పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

వీరవాసరం: పర్స సత్యనారాయణ వర్ధంతి సందర్భంగా వీరవాసరంలో సిఐటియు ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు మాట్లాడారు. కార్యక్రమంలో నేతలు డి.వరలక్ష్మి, కెఎల్.దుర్గ, వి.కుమారి, పి.పద్మ, కె.కుమారి, అన్నపూర్ణ, రాజమణి, ఎస్.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

నరసాపురం టౌన్: కార్మికోద్యమ నేత పర్స సత్యనారాయణ వర్ధంతిని స్థానిక మీరా గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ముచ్చర్ల త్రిమూర్తులు, పొన్నాడ రాము మాట్లాడారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు పొగాకు నారాయణరావు, మంచిలి నీలకంఠం, నోముల కొండ, బూడిద జోగేశ్వరరావు పాల్గొన్నారు.

పెనుమంట్ర: పర్స సత్యనారాయణ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని సిపిఎం మండల కార్యదర్శి కూసంపూడి సుబ్బరాజు అన్నారు. పర్స వర్ధంతిని బ్రాహ్మణచెరువులో నిర్వహించారు. కార్యక్రమంలో గంటి ఆంజనేయులు, శ్రీరామ్, హేమంత్, ఏడుకొండలు పాల్గొన్నారు.



చింతకాయల బాబూరావు, నేతలు

దరఖాస్తులు సమగ్రంగా పరిశీలించాలి

జాయింట్ కలెక్టర్ రామ్‌సుందర్‌రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

స్పందనలో వచ్చిన ప్రతి దరఖాస్తునూ అత్యంత బాధ్యతతో పరిశీలించి అర్జీదారులకు శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా జాయింటు కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లో నిర్వహించిన జిల్లాస్థాయి స్పందన కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుండి 176 అర్జీలను జెసి స్వీకరించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ స్పందనలో అందిన ప్రతి ఫిర్యాదు పరిష్కారం అర్జీదారులకు సంతృప్తిని కల్గించేలా ఉండాలన్నారు. అర్జీలు తిరిగి రీఓపెన్ అయ్యే అవకాశం లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఒకే సమస్యపై రెండోసారి స్పందనలో ఫిర్యాదు రాకుండా సమస్య పరిష్కారంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి, జిల్లా పంచాయతీ అధికారి జివికె.మల్లికార్జునరావు, డిఎల్‌డిఒ కెసిహెచ్.అప్పారావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి హామీలో పాత మస్తర్ విధానం కొనసాగించాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఉపాధి హామీ కూలీల ఉసురు తీసే ఎన్ఎంఎంఎస్ యాప్‌ను వెంటనే రద్దు చేసి పాత మస్తర్ విధానాన్ని కొనసాగించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షులు కూసంపూడి సుబ్బరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఓడూరు, బ్రాహ్మణచెరువు గ్రామాల్లో ఉపాధి హామీ కూలీల పని ప్రాంతానికి వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ పనులు తగ్గడంతో ఉపాధి హామీ పనులే తమకు పట్టెడన్నం పెడుతున్నాయని తెలిపారు. అయితే సమస్యలు మాత్రం ఎక్కువగానే ఉంటున్నాయని, తమ గోడు పట్టించుకునే వారే కరువయ్యారని వాపోయారు. ఈ సందర్భంగా జక్కంశెట్టి సత్యనారాయణ, కూసంపూడి సుబ్బరాజు మాట్లాడుతూ పేదల పొట్ట నింపుతున్న ఉపాధి హామీ పనులకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బడ్జెట్‌లో నిధుల కోత పెట్టడం దారుణమన్నారు. ఇప్పటికైనా పని దినాలు 200 రోజులకు పెంచి, కనీస వేతనం రూ.600 ఇవ్వాలని, ఆపిన వేసవి సౌకర్యాలన్నింటినీ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ సాధన కమిటీ అధ్యక్షులుగా నల్లి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా బీరా వెంకట నరసమ్మ, కార్యదర్శిగా నేతల నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా మైలే సులోచన, మరో ఆరుగురు సభ్యులుగా కమిటీ ఏర్పడింది.

అత్తిలి: పేదలకు పని కల్పిస్తున్న ఉపాధి హామీ చట్టం ఊపిరి తీసేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు అన్నారు. వరిగేడు గ్రామ పంచాయతీ పరిధి ఎర్రనీలిగుంటలో పని చేస్తున్న ఉపాధి హామీ కూలీలతో ఆయన మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. గతంలో నీడ కోసం టెంట్ వేసేవారని, తాగునీరు, మజ్జిగ ఇచ్చేవారని, ప్రస్తుతం కనీసం తాగునీరు ఇవ్వడం లేదని వాపోయారు. తాము బాటిళ్లలో నీళ్లు తెచ్చుకున్నా సరిపోవడం లేదన్నారు. దీంతో దాహంతో విలవిల్లాడుతూ పని చేస్తున్నామన్నారు. దీనిపై వీరభద్రరావు మాట్లాడుతూ ఇళ్ల నుంచి బయటకు రాలేని విధంగా మండుటెండలు కాస్తున్న ఈ కాలంలో కూడా శ్రమ జీవులైన ఉపాధి కూలీలకు పని చేసే ప్రదేశంలో తాగునీరు సైతం ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. అనంతరం ఖాళీ మంచినీళ్ల బాటిళ్లతో కొద్దిసేపు నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఉపాధి హామీ వ్యతిరేక విధానాలను కూలీలు ఐకమత్యంతో తిప్పికొట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పెచ్చెట్టి చంద్రరావు, పితాని దానేశ్వరరావు, బొక్కా లక్ష్మి, మునినే రత్నకుమారి, కుడిపూడి రమణ, సీతామహాలక్ష్మి, కట్టా సౌభాగ్యశ్రీ, సానబోయిన సత్యనారాయణ, బాలం చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పెనుగొండ: నడిపూడి, వడలి గ్రామాల్లో గ్రామీణ ఉపాధి హామీ కార్మికులను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు షేక్ పాదుషా కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాదుషా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి చట్టానికి తూట్లు పొడిచే విధంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పనుల సందర్శనలో వ్యకాస నేతలు

పెనుమంట్ర మండలంలో..

అత్తిలి మండలంలో..

పది విద్యార్థులకు బహుమతులు : కలెక్టర్ పి.ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

నియోజకవర్గాలవారీ పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేయనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లా అధికారులు, మండలాధికారులతో కలెక్టర్ వివిధ అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రశాంతి మాట్లాడుతూ పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ మార్కులు సంపాదించిన విద్యార్థులకు ఈ నెల 25న జగనన్న ఆణిముత్యాలులో భాగంగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేయనున్నట్లు చెప్పారు. 25న నియోజకవర్గ స్థాయిలో జరిగే కార్యక్రమాల్లో మంత్రులు, ఎంఎల్ఎ పాల్గొంటారని ప్రత్యేకాధికారులు ఎటువంటి లోపాలు జరగకుండా చూడాలన్నారు. జగనన్నకు చెబుదాంలో భాగంగా వచ్చిన ఫిర్యాదులను ఆయా శాఖల అధికారులు లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ఆమె ఆదేశించారు. లేఅవుట్లలో నిర్మాణం ప్రారంభించని ఇళ్లు ఆప్షన్ త్రీలో ప్రారంభించాలని, ప్రతి 15 రోజులకు స్టేజీలు మారాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డిఆర్ఒ కె.కృష్ణవేణి, డిఎల్‌డిఒ కెసిహెచ్.అప్పారావు, వివిధ శాఖల జిలా, మండల అధికారులు పాల్గొన్నారు.

మరణాల శాతం జీరోగా ఉండాలి : కలెక్టర్

ప్రజాశక్తి - తణుకు రూరల్

అత్యవసర పరిస్థితులు, పాము కాటుకు గురైనప్పుడు చికిత్సలు సత్వరమే అందించి జీరో మరణాలు శాతం నమోదయ్యేలా చూడాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. తణుకు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల ఆరు రోజుల శిక్షణ కార్యక్రమాలను సోమవారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రశాంతి మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమంలో మెలకువలు తెలుసుకుని ప్రజలు మెచ్చే రీతిలో వైద్యసేవలందించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించాలన్నారు. లేకపోతే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ప్రతి ఆసుపత్రిలో, డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లో పాము కాటు, అత్యవసర మందులు తప్పనిసరిగా ఉండేలా చూసి వైద్య సేవలు అందించాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు 346 మంది ఉన్నారన్నారు. ఆరు రోజుల శిక్షణ కార్యక్రమంలో తొలి రోజు 41 మందికి శిక్షణ ఇస్తున్నామన్నారు. 26వ తేదీ వరకు ఐదు రోజులు శిక్షణ కార్యక్రమాలు ఇక్కడే నిర్వహించి ముగింపు రోజు 27వ తేదీ శనివారం శిక్షణ కార్యక్రమాన్ని భీమవరం విష్ణు డెంటల్ కాలేజీలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గణాంక శాఖ డిప్యూటీ డైరెక్టర్ శివశంకర్‌బాబు, తణుకు జిల్లా ఆసుపత్రి ఇన్‌ఛార్జి పర్యవేక్షకులు డాక్టర్ వెంగల అరుణ, డిఐఎంఒ డాక్టర్ సుగుణరాజు, నోడల్ అధికారి డాక్టర్ కీర్తి పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ ప్రశాంతికి తణుకు జిల్లా ఆసుపత్రిలో పనిచేస్తున్న ఆఫీస్ సబార్డినేట్లు 15 నెలల నుంచి జీతాలు లేక ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వెంటనే జీతాలు వచ్చేటట్లు చూడాలని వినతిపత్రం అందించారు.

చర్మకారులకు బడ్డీ షాపులిచ్చి ఆదుకోవాలి

కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతిబాబు

ప్రజాశక్తి - భీమవరం

పట్టణంలో రోడ్డు పక్కన చర్మకార చేతి వృత్తి చేసుకుంటున్న చెప్పులు కుట్టుకునే కార్మికులందరికీ బడ్డీ షాపులు ఇచ్చి ఆదుకోవాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సి.రామచంద్రారెడ్డికి చర్మకార వృత్తిదారుల సమస్యలపై వినతిపత్రం అందజేసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా క్రాంతిబాబు మాట్లాడుతూ జిల్లా కేంద్రం భీమవరం పట్టణంలో సుమారు 60 మంది దళితులు చెప్పులు కుట్టుకుని వృత్తి చేసుకుంటున్నారన్నారు. జిల్లాలోని సాంఘిక సంక్షేమ అధికారులు ఇప్పటివరకు చర్మకార వృత్తిదారుల సమస్యలపై కనీసం స్పందించలేదని విమర్శించారు. రోడ్డుపక్కన చిన్న బరకం వేసుకుని, గొడుగు కింద కూర్చుని వృత్తి చేసుకుంటున్న అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. వీళ్లందరికీ తక్షణం బడ్డీషాపులు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారందరికీ గుర్తింపు కార్డులిచ్చి 40 ఏళ్ల దాటిన వారికి పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంవత్సరానికి ఒకసారి పనిముట్లు ఇవ్వాలన్నారు. అర్హులందరికీ ఇళ్ల స్థలాలిచ్చి ఇల్లు కట్టుకోవడానికి రూ.5 లక్షలు ఇవ్వాలని, వృత్తిదారులు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించాలని క్రాంతిబాబు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు.

హైకోర్టు చీఫ్ జస్టిస్‌ను కలిసిన జనసేన నేతలు

ప్రజాశక్తి - వీరవాసరం

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆకుల వెంకటశేషసాయిని వీరవాసరం మండలానికి చెందిన జెడ్‌పిటిసి సభ్యులు గుండా జయప్రకాష్‌నాయుడు, జనసేన పార్టీ అధ్యక్షులు గుండా రామకృష్ణ సోమవారం న్యాయమూర్తి ఇంటి వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందించి అభినందనలు తెలిపారు. భీమవరానికి చెందిన శేషసాయి ప్రధాన న్యాయమూర్తిగా నియమింపబడటం ఈ ప్రాంత వాసులందరికి గర్వకారణమని రామకృష్ణ అన్నారు.

జగనన్న కాలనీలో విద్యుత్ లైన్ ఏర్పాటు

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం జగనన్న కాలనీలో కోటి రూపాయల వ్యయంతో విద్యుత్ లైన్ల ఏర్పాటు పనులను ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీలో లబ్ధిదారులకు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు వీలైనంత తొందరగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు.

పండితవిల్లూరులో ఉపాధి హామీ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - పోడూరు

మండలంలోని పండితవిల్లూరు గ్రామంలో మూడున్నర ఎకరాల మల్లయ్య చెరువు పూడిక తవ్వకాలను ఉపాధి హామీ పనుల్లో భాగంగా ఎంపిపి సబిత సుమంగళిసాగర్ సోమవారం ప్రారంభించారు. సోమవారం వంద మంది కూలీలు పనిలో పాల్గొన్నారని, రేపటి నుంచి 150 నుంచి 200 మంది ఈ పనిలో పాల్గొని పది రోజుల్లో చెరువు పూడికను పూర్తి చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఇళ్ల లక్ష్మీచంద్రిక శ్రీనివాస్, ఉప సర్పంచి సద మళ్లవెంకటేష్, పండితవిల్లూరు కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు గెద్దాడ ఏకలవ్య, ఎంపిటిసి సభ్యులు ఇందుకూరి సూర్యకాంత వరహాలరాజు పాల్గొన్నారు.

'మానవత' సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి - ఉండి

మానవత సంస్థ సేవలు ప్రశంసనీయమని ఉండి మండలానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త ద్వారంపూడి నారాయణరెడ్డి, ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు అన్నారు. ఉండి మార్కెట్‌లో మానవత సంస్థ మండల అధ్యక్షులు దంగేటి రామలింగేశ్వరరావు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సమావేశంలో ద్వారంపూడి నారాయణరెడ్డి ఆమె తల్లి లక్ష్మీదేవి పేరిట ఫ్రీజర్‌ను సంస్థకు బహుకరించారు. ఈ సందర్భంగా ద్వారంపూడి నారాయణరెడ్డి, ఎంపిపి శ్రీహరి నారాయణరాజు మాట్లాడుతూ మానవత సంస్థ సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. సంస్థ మండలాధ్యక్షులు, కలిసిపూడి ఎంపిటిసి సభ్యులు దంగేటి రామలింగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామంలో ఎవరికైనా ఫ్రీజర్ అవసరమైతే వెంటనే నియోజకవర్గ మానవత కన్వీనర్ కొమ్మన నాగబాబును సంప్రదించాలని ఆయన సూచించారు. అనంతరం 2023-24కు సంబంధించిన మానవత డైరీని ఎస్ఐ గంగాధరరావు ఆవిష్కరించారు.

మంచినీటి కుండీలు ఏర్పాటు

ప్రజాశక్తి - పాలకొల్లు

మూగ జీవాల దాహార్తి తీర్చేందుకు కాపు వనిత క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం పాలకొల్లు ప్రధాన కూడలిలో మంచినీటి కుండీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి క్లబ్ గవర్నర్ డాక్టర్ సంజయ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. దేశాలమ్మ గుడి, పెద్ద సాయిబాబా గుడి రోడ్డు నందు, వీనస్ లాడ్జి, శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద, కారుమూరి వారి వీధిలో ఈ కుండీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు మంగిన అరుణ, కార్యదర్శి డాక్టర్ మౌని కావలి, యామని విజయలక్ష్మి, యర్రంశెట్టి అనూష, నారిన సూర్యకుమారి, రావి సృజన, క్లబ్ అధ్యక్షులు పెనుమాక రామ్మోహన్, కార్యదర్శి జక్కంపూడి మదన్ పాల్గొన్నారు.

వంతెన నిర్మాణ పనులు పరిశీలన

ప్రజాశక్తి - ఉండి

ఎన్ఆర్‌పి అగ్రహారంలోని ఉండి ప్రధాన పంట కాలువ వంతెన నిర్మాణ పనులను ఎంపిపి ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిషత్ నిధులు సుమారు రూ.ఏడు లక్షలు ఈ వంతెన నిర్మాణానికి కేటాయించగా మిగిలిన నిధులను ఎన్ఆర్‌పి అగ్రహారంలోని బిసి కాలనీ అభివృద్ధి కమిటీ, జల సిద్ధి వినాయక స్వామి ఆలయ కమిటీ వారు ఇవ్వనున్నట్లు తెలిపారు. వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం గ్రామ సర్పంచి సూరవరపు కనకదుర్గ వెంకటాచార్యులు మాట్లాడుతూ ఎన్ఆర్‌పి అగ్రహారంలోని బిసి, ఎస్‌సి కాలనీల్లో చదివే విద్యార్థులు పాఠశాలకు వెళ్లడానికి చాలా దూరం ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడిందని, దీంతో బిసి కాలనీలోని కొంతమంది ఎంపిటిసి ద్వారా ఎంపిపితో మాట్లాడి మండల పరిషత్ నిధులు రావడానికి కృషి చేశారని వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

'వైసిపి హయాంలో అభివృద్ధి శూన్యం'

ప్రజాశక్తి - పాలకొల్లు

టిడిపి హయాంలో పాలకొల్లు నియోజకవర్గంలో 33కెవి సబ్‌స్టేషన్లు నిర్మిస్తే, వైసిపి నాలుగేళ్ల పాలనలో ఏం చేశారని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు ప్రశ్నించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. వైసిపివారికి పదవులపై ఉన్న శ్రద్ధ ప్రజలపై లేదన్నారు. పాలకొల్లు నియోజకవర్గంలో విద్యుత్ కోతలపై ఇన్‌ఛార్జిని నిలదీయాలన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

రసాభసాగా పాలకోడేరు పంచాయతీ పాలకవర్గ సమావేశం

సర్పంచి, కార్యదర్శిపై సభ్యుల ఆరోపణలు

ఎంపిడిఒకు వినతిపత్రం అందించిన వైనం



పంచాయతీ కార్యదర్శితో మాట్లాడుతున్న వార్డు సభ్యులు

ప్రజాశక్తి - పాలకోడేరు

పాలకోడేరు గ్రామపంచాయతీ పాలకవర్గ సమావేశం రసభాసగా సాగింది. పరస్పర ఆరోపణలు, విమర్శల, వాగ్వివాదాల మధ్య సాగింది. సర్పంచి ఇంజేటి మరియమ్మ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శి రమాలీల సోమవారం పాలకవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వార్డు సభ్యులు మాట్లాడుతూ ఎన్నికై రెండేళ్లు పూర్తి కావస్తున్నా తాము ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డుల్లో ఎటువంటి అభివృద్ధి పనులు చేయలేకపోయామని వాపోయారు. మొదటి సమావేశంలో తీర్మానించిన పనులను ఇప్పటికీ పూర్తి చేయలేదన్నారు. అసలు గ్రామ పంచాయతీకి ఎంత ఆదాయం వస్తుందో, ఖర్చులు ఎంతో తదితర విషయాలపై అడిగినా కార్యదర్శి రామలీల తమకు ఎటువంటి సమాధానం చెప్పడం లేదని సభ్యులు ఆరోపించారు. సర్పంచి భర్త లక్ష్మీపతి పంచాయతీ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటూ సిబ్బంది, పాలకవర్గ సభ్యులను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. సర్పంచి మరియమ్మ మాట్లాడుతూ కార్యదర్శితో పాటు సిబ్బంది తనను గౌరవించడం లేదని వాపోయారు. గత మూడేళ్లుగా పంచాయతీ ఆదాయ వ్యయాలపై ఉన్నతాధికారులు విచారణ చేయాలని సభ్యులు కోరారు. అప్పటివరకు తాము పంచాయతీ సమావేశాలకు హాజరు కామని స్పష్టం చేశారు. సర్పంచి మరియమ్మ కార్యదర్శి రమాలీల మధ్య సమన్వయం రాకపోవడం వల్ల గ్రామంలో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా అధ్వానంగా మారాయన్నారు. గ్రామంలో వారం రోజులుగా ఆలం కలపకుండా తాగునీటిని సరఫరా చేయడంపై సభ్యులు తప్పుపట్టారు. ఆలం కొనుగోళ్లకు సంబంధించి గత బిల్లులు మంజూరు చేయకపోవడంతో గుత్తేదారుడు సరఫరా నిలిపివేశారని పేర్కొన్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ నాలుగు రోజుల క్రితమే ఆలం నిల్వలు అయిపోయాయని, కొనుగోలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పంచాయతీ తాగునీటి సరఫరా విభాగంలో ఒప్పంద పద్ధతిలో పనిచేస్తున్న కృష్ణ అనే వ్యక్తి పంచాయతీ కార్యాలయంలో విధులు నిర్వహించడాన్ని సర్పంచి తప్పుపట్టారు. ఈ నెల అతనికి వేతనం నిలిపివేయాలంటూ కార్యదర్శికి సర్పంచి మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. దీంతో అతనితోపాటు పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య సిబ్బందికి కార్యదర్శి ఏప్రిల్ నెలకు సంబంధించిన జీతాలు బిల్లు చేయలేదు. దీనిపై పంచాయతీ సభ్యులంతా కార్యదర్శి తీరును నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆరోపణలు చేశారు. సర్పంచి లిఖిత పూర్వకంగా ఆదేశాలిస్తే పంచాయతీ సిబ్బందికి వేతనాలు బిల్లులు చెల్లిస్తానని కార్యదర్శి తెలిపారు. తాను దళిత సర్పంచినని కావాలనే తనపై లేనిపోని ఆరోపణ చేస్తూ వివక్ష చూపుతున్నారని సర్పంచి మరియమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. ఎటువంటి గౌరవ మర్యాదలు ఇవ్వకుండా చిన్న చూపు చూస్తున్నారన్నారు.

సర్పంచి భర్త రూ.రెండు లక్షల లంచం అడిగారు
పి.రామకృష్ణ, పంచాయతీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షులు

తను గత 15 ఏళ్ల నుంచి పంచాయతీలో ఫిట్టర్‌గా ఉన్నప్పటికీ పంచాయతీ కార్యాలయం పనులు నిర్వహిస్తున్నానని పంచాయతీ కాంట్రాక్ట్ వర్కర్స్ మండల అధ్యక్షుడు, సిఐటియు మండల ఉపాధ్యక్షులు పి.రావకృష్ణ తెలిపారు. ఇటీవల సర్పంచి భర్త లక్ష్మీపతి తాను పోస్టులో ఉండాలంటే రూ.రెండు లక్షలు లంచం అడిగారని ఆరోపించారు. ఇవ్వకపోతే పోస్టు నుంచి తొలగిస్తానని ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెప్పారు. పంచాయతీ కార్మికుడిగా యూనియన్ నాయకుడిగా ఉన్నప్పటికీ తనను వేధింపులకు గురిచేసి వేతనం కూడా ఇవ్వకుండా ముప్పు తిప్పలు పెట్టారని ఆరోపించారు. పంచాయతీ కార్మికులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. మండలంలో పంచాయతీ కార్యాలయంలో అనేకమంది అనేక ఇబ్బందులు, అవమానాల మధ్య విధులు నిర్వహిస్తున్నారని, వారందరికీ సిఐటియు అండగా ఉంటుందని పేర్కొన్నారు.

ఫ్లెక్సీని ధ్వంసం చేసినవారిని పట్టుకుంటాం : డిఎస్‌పి

ప్రజాశక్తి - ఆచంట

మండలంలోని పెనుమంచిలి పంచాయతీ పరిధిలోని రాయికింద గ్రామంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఫ్లెక్సీని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంపై నరసాపురం డిఎస్‌పి రవిమనోహర్‌చారి సోమవారం సాయంత్రం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫ్లెక్సీని ధ్వంసం చేసినవారిని పట్టుకుంటామన్నారు. గ్రామాల్లో ఇటువంటి గొడవలు తలెత్తకుండా ముందస్తుగానే అంబేద్కర్ ఫ్లెక్సీలు తొలగిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు రూరల్ సిఐ కొండవీటి శ్రీనివాస్, పెనుగొండ ఎస్ఐ రమేష్ బాబు, పంచాయతీ కార్యదర్శి రాంబాబు, విఆర్ఒ సూర్యనారాయణ ఉన్నారు.

'వాలంటీర్లు సంక్షేమ సారథులు'

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

వాలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్నారని, అవినీతి లేకుండా రాష్ట్రంలో పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించడానికి ప్రభుత్వం వాలంటీర్లు, సచివాలయ వ్యవస్థకు నాంది పలికిందని, కరోనా కష్ట కాలంలో వాలంటీర్ల సేవలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. స్థానిక శ్రీ అల్లూరి కళ్యాణ మండపంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ వెంకట రమణ అధ్యక్షతన నిర్వహించిన వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసేందుకు ముఖ్య పాత్ర పోషిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బందితో వాలంటీర్లు పూర్తి సహకారం, సమన్వయంతో వ్యవహరించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన సూచించారు. పశ్చిమ గోదావరి జిల్లాలో 8533 మందికి రూ.8,73,10000 నగదు పురస్కారాలు సిఎం జగన్ బటన్ నొక్కి నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు జమ చేశారన్నారు. నరసాపురం నియోజకవర్గంలో 1086 మంది వాలంటీర్లు ఉండగా వారిలో 1006 మంది వాలంటీర్లకు రూ.1,03,10000 పురస్కారాలు అందించినట్లు తెలిపారు. నరసాపురం పట్టణ పరిధిలో 262 మందికి సేవా మిత్ర, ఐదుగురికి సేవా రత్న, ఇద్దరకు సేవా వజ్ర అందించనున్నట్లు తెలిపారు.

మాజీ ఎంఎల్‌సికి అచ్చెన్నాయుడు పరామర్శ

ప్రజాశక్తి - ఉండి

మాజీ ఎంఎల్‌సి, టిడిపి సీనియర్ నాయకులు మంతెన వెంకట సత్యనారాయణ రాజు (పాందువ్వ శ్రీను) తండ్రి విశ్రాంత ప్రధానోపాధ్యాయులు మంతెన నారాయణరాజు మృతి ఆయన కుటుంబానికి తీరని లోటని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని పాందువ్వ గ్రామంలో వెంకట సత్యనారాయణరాజును అచ్చెన్నాయుడు సోమవారం పరామర్శించారు. సత్యనారాయణరాజును టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి, ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు, ఎంఎల్ఎ పుప్పాల శ్రీనివాసరావు, టిడిపి ఏలూరు జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, మాజీ ఎంఎల్ఎలు పితాని సత్యనారాయణ, వేటుకూరి వెంకట శివరామరాజు, ఆరిమిల్లి రాధాకృష్ణ, బండారు మాధవనాయుడు, జనసేన నాయకులు ధర్మరాజు పరామర్శించారు.

విజయవంతంగా వేసవి విజ్ఞాన శిబిరాలు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

నరసాపురం ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు సోమవారం పుస్తక, పత్రికా పఠనం చేయించినట్లు తెలిపారు. నీతి కథలు చదవడం, వినడం ద్వారా విద్యార్థుల్లో నైతిక విలువలకు పునాదులు ఏర్పడతాయని శాస్త్రవేత్త సుబ్బారావు అన్నారు. "సరదాగా సమ్మర్ క్యాంపు" పుస్తకాలను సాఫ్ట్ లైన్ కంప్యూటర్స్ సుధీర్ మోహన్ పిల్లలకు పంపిణీ చేశారు. అనంతరం పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ ఉచిత వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో రిసోర్స్ పర్సన్స్ స్కూల్ అసిస్టెంట్ సిహెచ్.శ్రీనివాస్, హెచ్ఎం వెంకటేశ్వరరావు, సూర్యం బాబు, జీవన్ కుమార్, తోట శ్రీనివాస్, ఆత్మూరి రమ, డ్యాన్స్ మాస్టర్ విక్టర్‌రాజు, నితీష్, హారిక, సూర్యనారాయణ పాల్గొన్నారు. విరామ సమయంలో పిల్లలకు స్నాక్స్ ఇచ్చినట్లు గ్రేడ్ వన్ లైబ్రరీయన్ కెజెఎస్ఎస్ఎల్.కుమారి తెలిపారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట : పివిఎల్

ప్రజాశక్తి - పాలకోడేరు

వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి ప్రజా సంక్షేమనికి పెద్ద పీట వేస్తుందని డిసిసిబి ఛైర్మన్, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు అన్నారు. ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణరాజు (చంటి రాజు) ఆధ్వర్యంలో మండలంలోని వేంద్ర గ్రామంలో సోమవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కడలి నాగేశ్వరి, ఉప సర్పంచి భూపతి రాజు సుబ్బరాజు పాల్గొన్నారు.

ప్రజలకు సచివాలయాల విశిష్ట సేవలు

ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ప్రజలకు ప్రభుత్వ సేవలను అత్యంత దగ్గర చేస్తూ ముఖ్యమంత్రి జగన్ ఏర్పాటు చేసిన సచివాలయాలు ప్రజలకు విశిష్ట సేవలందిస్తున్నాయని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని రాయలం గ్రామంలో పలు అభివృద్ధి పనులను ఆయన సోమవారం ప్రారంభించారు. సాయిబాబా ఆలయం రోడ్డులో రూ.65.30 లక్షలతో నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. అనంతరం రూ.45.70 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ మహాత్మ గాంధీ ఆశయాలకు అనుగుణంగా గ్రామ స్వరాజ్యాన్ని స్థాపించే దిశలో భాగంగా గ్రామ సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి ప్రజలకు అధికారులను మరింత అందుబాటులోకి తీసుకొచ్చిన ఘనత దేశంలో జగన్‌కే మాత్రమే దక్కిందన్నారు. ప్రజా సమస్యల పట్ల సచివాలయ సిబ్బంది జవాబుదారీతనంగా పనిచేస్తున్నారన్నారు. అంతేకాకుండా ప్రతి గ్రామంలో కూడా సిసి రోడ్లు, డ్రెయినేజీ సౌకర్యాలను

సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ గ్రంధి

మెరుగుపరుస్తున్నామన్నారు. భీమవరం నియోజకవర్గంలో ప్రజల కోరిక మేరకు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, తమది ప్రజా ప్రభుత్వమని ఆయన స్పష్టం చేశారు. రాయలం గ్రామ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో పాల్గొనడానికి వచ్చిన ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్‌కు అక్కడి ప్రజలు వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి ఆ సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు. అదే మాదిరిగా అక్కడి ప్రజల కోరిక మేరకు మూడు సిసి రోడ్లను మంజూరు చేశారు.

కంటి చూపు పట్ల జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి - గణపవరం

కంటి చూపు పట్ల ప్రతిఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్.కొండేపాడు గ్రామ సర్పంచి సీతాళం వీరవరలక్ష్మి అన్నారు. గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యాన గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కంటి వెలుగు కార్యక్రమంలో ప్రతిఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో 55 మంది వృద్ధులకు కంటి పరీక్షలు చేయగా వారందరికీ కళ్లజోళ్లు పడతాయని నేత్ర వైద్యులు శ్రీనివాస్ తెలిపారు. కళ్లజోళ్లు ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డి.గోపినాథ్, హల్త్ అసిస్టెంట్ కెవిఎస్.రెడ్డి,



కంటి పరీక్షలు చేస్తున్న నేత్ర వైద్యులు

ఎఎన్ఎం కె.విజయలక్ష్మి, ఆశావర్కర్లు, కె.లక్ష్మీమాధవి, విఆర్ఒ కె.జానకిరామయ్య పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడులను అరికట్టాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

జర్నలిస్టులపై దాడుల నివారణకు ప్రత్యేక చట్టం చేయాలన్న ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సిఫార్సును కేంద్ర ప్రభుత్వం పాటించాలని, వెంటనే చట్టం వేయాలని ఐజెయు జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్ డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై దాడులను ఖండిస్తూ ఎపియుడబ్ల్యూజె రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు సోమవారం తాడేపల్లిగూడెంలో పాత్రికేయులు తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి డి.సోమసుందర్, ఈ కార్యక్రమంలో ఎపియుడబ్ల్యూజె పశ్చిమగోదావరి జిల్లా శాఖ కన్వీనర్ గజపతి వరప్రసాద్ మాట్లాడారు. తణుకు, కర్నూలు కేంద్రాల్లో జర్నలిస్టులపై దాడులకు పాల్పడిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని, జర్నలిస్టుల భద్రతకు ప్రత్యేక చట్టం చేయాలని, విజయనగరం పాత్రికేయులపై సిఐడి పెట్టిన అక్రమ కేసు ఎత్తివేయాలని కోరుతూ తహశీల్దార్ వై.అప్పారావుకు వినతిపత్రం అందించారు. ఈ ధర్నాలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు పాల్గొన్నారు.

పరిహారం ఇస్తామని అధికారుల మోసం

13వ రోజుకు పాలకోడేరు రైతుల నిరసన

ప్రజాశక్తి - పాలకోడేరు

పరిహారం అందిస్తామని చెప్పి భూములు

నిరసన తెలుపుతున్న బాధిత రైతులు

తీసుకుని అధికారులు మోసం చేశారని పాలకోడేరు జగనన్న లే అవుట్‌కు భూములు ఇచ్చిన రైతులు విమర్శించారు. పరిహారం ఇవ్వకపోతే మా భూమి మాకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాలకోడేరు జగనన్న లే అవుట్‌కు భూములు ఇచ్చిన రైతులు చేపట్టిన నిరసన దీక్షలు సోమవారంతో 13వ రోజుకు చేరుకున్నాయి. దీనిలో భాగంగా బాధితులంతా మండుటెండలో నిరసన తెలిపారు. దీక్షలు కొనసాగిస్తున్న అధికారులు స్పందించకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, అధికారులు స్పందించే వరకు తమ దీక్షలు విరమించబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బాధిత రైతులు రామలక్ష్మి, నరేష్, సంబలదీవి సాయిబాబా, సత్యనారాయణ పాల్గొన్నారు.

శిథిల వంతెన పరిశీలన

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ఉండి

శిథిలావస్థకు చేరిన ఉండి చిన్నవంతెనను పంచాయతీరాజ్ శాఖ ఆకివీడు సబ్ డివిజన్ డిఇ కెఎస్.శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. శిథిలావస్థలో వంతెన శీర్షికన ఈ నెల 15వ తేదీన ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంతెన పునాది బలంగానే ఉందని, కాని స్లాబ్ మాత్రం పూర్తిగా పాడైపోయిందని చెప్పారు. ఉండి గ్రామపంచాయతీ వారు గతంలో ఈ వంతెన పైనుంచి పైపులైను వేయడంతో పైపులైను లీకేజీ సమయంలో నీరు నిలిచిపోయి ఒక వైపు స్టీల్ బీము పూర్తిగా పాడైపోయిందన్నారు. వంతెన స్లాబ్ మార్చి కొత్తగా వేయడానికి సుమారు రూ.15 లక్షల ఖర్చవుతుందని ఉండి గ్రామపంచాయతీ పాలకవర్గానికి చెప్పారు. అనంతరం

వంతెనను పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

ఉండి ఉప సర్పంచి గొట్టుముక్కల కల్యాణ్‌వర్మ మాట్లాడుతూ జిల్లా పరిషత్ నిధుల నుంచి ఈ వంతెన స్లాబ్ నిర్మాణం గురించి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు దృష్టికి తీసుకెళ్తామని, ఆయన సహకారంతో జిల్లా పరిషత్ నిధులు కేటాయించేలా జెడ్‌పిటిసితో మాట్లాడతామని చెప్పారు.

'స్పందన' ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

స్పందన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరిస్తామని ఎస్‌పి యు.రవిప్రకాష్ చెప్పారు. స్థానిక డిఎస్‌పి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 18 ఫిర్యాదులు అందాయి. స్పందన ఫిర్యాదుదారులతో ఎస్‌పి యు.రవిప్రకాష్ స్వయంగా మాట్లాడి ఫిర్యాదు స్వీకరించారు. అంతేకాకుండా వారి సమస్యలు త్వరితగతిన పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఇదే సందర్భంలో 70 ఏళ్ల వృద్ధురాలు స్పందన కార్యక్రమానికి రాగా తాను నడవలేకపోవటం తెలుసుకొని స్వయంగా ఎస్‌పి ఆ వృద్ధురాలి వద్దకు వెళ్లి సమస్యను తెలుసుకుని పరిష్కరిస్తానని చెప్పారు.

28 నుంచి ఎఐఎస్ఎఫ్ శిక్షణ తరగతులు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఈ నెల 28, 29, 30 తేదీల్లో భీమవరం ఢిల్లీ పబ్లిక్ స్కూలులో జరగనున్న అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) కోస్తాంధ్ర విద్యా, వైజ్ఞానిక, రాజకీయ, సైద్ధాంతిక శిక్షణ తరగతులు విజయవంతం చేయాలని సిపిఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు కోరారు. భీమవరం ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో సోమవారం ఎఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.మహేష్ అధ్యక్షత వహించారు. సమావేశంలో భీమారావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.అప్పలస్వామి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు కలిశెట్టి వెంకట్రావు, భీమవరం పట్టణ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు, మండల కార్యదర్శి ఎం.సీతారాంప్రసాద్ పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.12.65 లక్షలు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న బండి ముత్యాలమ్మ హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించామని ఆలయ కార్య నిర్వహణ అధికారి దెందుకూరి రామకృష్ణంరాజు తెలిపారు. 55 రోజులుకు హుండీ ఆదాయం రూ.12,65,114 సమకూరిందని ఆయన తెలిపారు. భీమవరంలోని శ్రీరాంపురం గ్రామంలో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి డి.కృష్ణంరాజు పర్యవేక్షణలో హుండీ ఆదాయం లెక్కించామన్నారు. ఈ లెక్కింపు కార్యక్రమం ఆలయ ఛైర్మన్ కొల్లాటి రామారావు, సర్పంచి కోపనాతి పల్లయ్య పాల్గొన్నారు.

దాతలు, స్వచ్ఛంద సంస్థలు సాయం అందించాలి

ప్రజాశక్తి - భీమవరం

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సూచనల మేరకు ప్రతి సోమవారం అర్జీదారులకు, వారితో వచ్చే సహాయకులకు చిరుధాన్యాలతో చేసిన అల్పాహారం, మజ్జిగ పంపిణీ చేయనున్నట్లు ఛైర్మన్ బద్రిరాజు తెలిపారు. దీనిలో భాగంగా ఇడ్లీ, మజ్జిగను సుమారు రెండు వందల మందికి రెడ్‌క్రాస్ సభ్యులు కృష్ణారావు, తణుకు గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్స్ ఆధ్వర్యంలో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమానికి దాతలు, స్వచ్ఛంద సంస్థలు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు.

చంద్రబాబు వ్యాఖ్యలపై వైసిపి నిరసన

ప్రజాశక్తి - పాలకొల్లు

ప్రజలకు సిఎం జగన్ ఇచ్చే ఇళ్ల స్థలాలపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు సరికావని పాలకొల్లులో జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ సారథ్యంలో పార్టీ నేతలు సోమవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. వైసిపి కార్యాలయం నుంచి గాంధీ బొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ, జెడ్‌పిటిసి సభ్యులు నడపన గోవిందరాజులు, జోగి వెంకటేశ్వరరావు, గాదె వెంకన్న, పవన్, మైఖేల్ రాజు పాల్గొన్నారు.

బిసిలకు మెరుగైన రిజర్వేషన్లు అమలు చేయాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

జనాభా కుల గణన ప్రకారం కుల గణన వివరాలు వెల్లడించి బిసిలకు మెరుగైన రిజర్వేషన్ అమలు చేయాలని జాతీయ బిసి ప్రజా సంక్షేమ సంఘం అధ్యక్షుడు గూడూరి వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మొగల్తూరులో నిర్వహించిన బిసి ప్రజా సంక్షేమ సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2011 కుల గణన వివరాలు పబ్లిక్ డొమైన్లో పెట్టలేదని, దీంతో ప్రజా సంఘాలు అన్ని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేసి పోరాడుతున్నా ఫలితం లేకపోయిందని చెప్పారు. ఈ సమావేశంలో నరసాపురం పార్లమెంట్ అధ్యక్షుడు కుక్కల సత్యనారాయణ, మల్లాది వెంకటేశ్వరరావు, కడిబోయిన సుబ్రహ్మణ్యం, కండిబోయిన గోపాల్, కడలి మందేశ్వరరావు, కె.సుబ్బారావు, మోటుపల్లి శ్రీను పాల్గొన్నారు.

పదోవ తరగతి టి.సి పోయినది

ఏలూరు జిల్లా, నూజివీడు డివిజన్, ముసునూరు మండలం, ముసునూరు గ్రామానికి చెందిన చింతా వెంకటేశ్వరరావు (లేటు), చింతా నాగమణీల కుమార్డు చింతా రాఘవేంద్ర తమ పదోవ తరగతి బదిలీ సర్టిఫికేట్ ముసునూరులో తమ ఇంటి వద్ద నుండి పోలీస్ స్టేషన్ సెంటర్‌కు జిరాక్స్ నిమిత్తం తీసుకువెళ్లి వచ్చే సమయంలో సిరియల్ నెంబర్ 1602133, ఎల్‌డిఐఎస్ నెంబర్ 943-బి2-2013 తేది 12-08-2013 గల టి.సి సర్టిఫికెట్ పోయినది. కావున ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింద అడ్రస్‌కు తెలియచేయగలరు.
ముసునూరు, ది.23-05-2023.

చింతా నాగమణీ
చింతా రాఘవేంద్ర
సెల్: 99510 42548